క్లుప్తంగా

నోట్ పుస్తకాల పంపిణీ



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): అన్నసంతర్పణ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం సత్యనారాయణపురంలోని ప్రశాంతి ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు గుండు దీలిప్ మాట్లాడుతూ అన్న సంతర్పణ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ప్రశాంతి ఎలిమెంటరీ పాఠశాలలో 500 మంది విద్యార్థులకు 2,500 నోట్ పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. రానున్న రోజుల్లో కూడా దాతలు, సభ్యుల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు మద్దిలక్ష్మి, మద్దుల వెంకటశివ రావు, కాశీవిశ్వే రరావు, వీరభద్రరావు, దుర్గా శంకర్, గోపాలకృష్ణ, నరేంద్ర, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విశాఖపట్నంకు చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. శ్రీసాయి సురేఖ డాన్స్ అకాడమీకి చెందిన శిష్యబృందం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై కూచిపూడి నృత్య ప్రదర్శన ఇవ్వగా భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం అకాడమీకి చెందిన చిన్నారులు పలు కీర్తనలకు నృత్యం ప్రదర్శించారు. ఆద్యంతం భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. పలువురు భక్తులు చిన్నారులను అభినందించారు. అనంతరం శిష్యబృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు.

అమరావతిలో ఘంటసాల విగ్రహ స్థాపనకు కృషి చేయాలి



విజయవాడ కల్చరల్: రాజధాని అమరావతి ప్రాంతంలో అమర గాయకుడు, కృష్ణా జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు ఘంటసాల విగ్రహనిర్మాణానికి ప్రభుత్వం కృషి చేయాలని వివిధ సంస్థల ప్రతినిధులు అవనిగడ్డ శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్‌కు సోమవారం నగరంలో వినతి పత్రం అందజేశారు. తెలుగు కళావాహిని, పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వర రావు సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలోని నగరానికి వచ్చిన బుద్ధప్రసాద్‌ను కలుసుకున్నారు. ఘంటసాల లాంటి గాయకులు అరుదుగా జన్మిస్తార ని భావి తరాలకు ఘంటసాల సేవలు తెలియడానికి నిర్మాణం చేయాలని కోరారు. బుద్ధప్రసాద్ సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, చింతకాయల చిట్టిబాబు. కే వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నేడు వీఎంసీ స్థాయీ సంఘం ఎన్నిక

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ అభివృద్ధికి ఏర్పాటయ్యే స్థాయీ సంఘం ఎన్నికలు మంగళవారం నిర్వహించనున్నారు. మేయర్ అధ్యక్షతన ఉండే ఆరుగురు సభ్యుల ఎన్నికకు ఇప్పటికే వైఎస్సార్ సీపీ నుంచి ఆరుగురు కార్పొరేటర్లు, టీడీపీ నుంచి ఒక కార్పొరేటర్ నామినేషన్లు వేయగా వారి మధ్య జరుగుతాయి. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో ఉదయం 10.30 గంటల నుంచి 3 గంటల వరకు ఈ ప్రక్రియ ఉంటుంది.

ఆయిల్ ట్యాంకర్ ఢీకొని క్లర్క్ మృతి



మధురానగర్(విజయవాడ సెంట్రల్): ఆయిల్ ట్యాంకర్ ఢీ కొని బీఎంపీఎస్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసు క్లర్క్ మృతి చెందిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన కొసన వెంకటేశ్వరరావు (50) ఆటోనగర్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసులో క్లర్క్‌గా పనిచేస్తున్నారు. ఈయన ఆదివారం డ్యూటీ ముగించుకుని సోమవారం ఉదయం 7 గంటలకు ద్విచక్రవాహనంపై తిరిగి ఇంటికి వెళుతుండగా రామవరప్పాడు వంతెన సమీపంలో ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరరావు మృతి చెందాడు. మృతుని కుమారుడు కిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదల మదిలో వైఎస్ చెదరని జ్ఞాపకం

- వాడ వాడలా వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి
- వైఎస్సార్ విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులర్పించిన నేతలు
- వైఎస్సార్‌ను స్మరించుకున్న అభిమానులు



కేక్ కట్‌చేస్తున్న డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ



32వ డివిజన్‌లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



అంబేద్కర్ కాలనీలో కేక్ కట్‌చేస్తున్న కార్పొరేటర్ పెనుమత్స శిరీష



గిరిపురంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కుక్కల అనిత, తదితరులు



సింగ్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నియోజకవర్గ వ్యాప్తంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో వైఎస్ విగ్రహాలకు, చిత్రపటాలకు నాయలు, అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక 31వ డివిజన్ అంబేద్కర్ కాలనీలో సోమవారం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష పాల్గొని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. నాయకులు సామంతపూడి చిన్నా, పెనుమత్స సత్యం, వెంకటరెడ్డి, పట్టాభి రామరాజు పాల్గొన్నారు.

గులాబీతోటలో..

గులాబీతోటలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ప్రజా కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. నాయకులు బీ నరసింహారావు, డీ రమణ తదితరులు పాల్గొన్నారు.

32వ డివిజన్‌లో..

32వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్ ఆధ్వర్యాన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జి ఒగ్గు గవాస్కర్ పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

అంబేద్కర్ కాలనీలో..

అంబేద్కర్ కాలనీలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి బెజ్జం రవికుమార్ నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతి పేద వాడి హృదయంలో ఎన్నటికీ నిలిచే ఉంటారని కొనియాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు జీ శ్యామ్, సువర్ణరాజు, రంగారావు పాల్గొన్నారు.

గిరిపురంలో..

లబ్బీపేట(విజయవాడతూర్పు): డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను సోమవారం గిరిపురం మూడు బొమ్మల సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ పది హేనేళ్ల కిందట మరణించిన డాక్టర్ వైఎస్సార్ నేటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. కుక్కల రమేష్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

మనసున్న మహానేత డాక్టర్ వైఎస్సార్..

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన మంచి పనులు ప్రజలు మర్చిపోలేదని, అందుకే ఆయన్ను మహానేతగా వారి హృదయాల్లో నిలుపుకున్నారని 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి అన్నారు. సత్యనారాయణపురంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు లంక బాబు, కమ్మిలి రత్నకుమార్, కూనపులి ఫణి, ఒగిరాల రాజశేఖర్, తాడంకి భాస్కర్, పొన్నూలూరి సనత్, ఉప్పు రంగబాబు, కాశీ విశ్వనాథ్, రవి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): 29వ డివిజన్ మధురానగర్ మెయిన్ రోడ్డులో సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు పూర్ణ ఆధ్వర్యాన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి జరిగింది. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కంభం కొండల రావు, ఎస్‌కే అక్బర్, డాక్టర్ పిల్లి జయకృష్ణ, బోనం నాగు, గోవిందు పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): చెదరిపోని గుండె బలం, నాయకత్వానికి నిలువెత్తు రూపం, మేరునగ ధీరుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతి వేడుకలు సింగ్ నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు.

ఎమ్మెల్సీ కార్యాలయంలో:

సింగ్‌నగర్ డాబాకొట్లుసెంటర్‌లోని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా కార్యాలయం వద్ద వైఎస్సార్ జయంతి వేడుకలు జరిగాయి. కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, అమిత్, జిలాని పాల్గొన్నారు.

నందమూరినగర్‌లో..

సింగ్‌నగర్ 58వ డివిజన్ నందమూరినగర్‌లో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ ముఖ్యఅతిథిగా పాల్గొని స్థానిక నాయకులతో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూరాజరాజేశ్వరీపేటలో..

స్థానిక 57వ డివిజన్ న్యూఆర్ఆర్‌పేటలో వైఎస్సార్ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్పొరేటర్ ఇసరపు దేవి పాల్గొని వైఎస్సార్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇసరపు రాజు, బాల తదితరులు పాల్గొన్నారు.

వాంబేకాలనీలో..

స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలో వైఎస్సార్ జయంతి వేడుకలను జరిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇస్మాయేల్, బాబు, అన్నపురెడ్డి, సుభాని, క్యాష్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు నేలపై చెరగని జ్ఞాపకం వైఎస్సార్

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు



రాజీవ్‌నగర్లో వైఎస్సార్ విగ్రహంవద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): సంక్షేమం, అభివృద్ధికి మానవీయతను జోడించిన మహనీయుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 63వ డివిజన్ రాజీవ్ నగర్లో వైఎస్సార్ జయంతి వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ ముఖ్యమంత్రి హోదాలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో 50 సార్లు అధికారిక పర్యటనలు చేసిన ఘనత ఒక్క వైఎస్‌కే దక్కుతుందన్నారు. పేదలకు జేఎస్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు, నూజివీడు ట్రిపుల్ ఐటీ, మిల్క్ ఫ్యాక్టరీ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణం, ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణంతో విజయవాడ నగర రూపురేఖలను పూర్తిగా మార్చివేశారన్నారు. వ్యవసాయం దండగంటూ చంద్రబాబు ఈసడించినా, దానిని పండగ చేసిన నాయకులు వైఎస్సార్ అని మల్లాది విష్ణు చెప్పారు. నిరుపేదలు కూడా ఉన్నత చదువులు చదవాలనే లక్ష్యంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేశారని ఆయన పేర్కొన్నారు. మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ ఆ మహనీయుని చలువేనని చెప్పుకొచ్చారు. ఈ మహనీయుని స్ఫూర్తితో వైఎస్సార్ సీపీ ముందుకు వెళుతుందన్నారు. డివిజన్ కో ఆర్డినేటర్ పసుపులేటి యేసు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మోదుగుల గణేష్, సీహెచ్ రవి, పి.శివారెడ్డి, ఉద్దంటి శ్రీను, గర్నేపూడి కోటేశ్వరరావు, జగదీష్, పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేసి, అన్నదానం చేశారు.

పలు డివిజన్లలో..

64వ డివిజన్ విలేజి కండ్రిక, కండ్రిక కాలనీలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, పార్టీ నాయకులు శ్రీరాములు, జె.శివ, దేవిరెడ్డి సంజీవరెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ రవీంద్రరెడ్డి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 62వ డివిజన్లో కార్పొరేటర్ అలంపూర్ విజయలక్ష్మి, ఎల్‌బీఎస్ నగర్లోని మూడు బొమ్మల సెంటర్లో, ప్రకాష్‌నగర్లోని మోహనరావు కొట్టు వద్ద వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అలంపూరు విజయ్, రామిరెడ్డి మహేష్, హైమావతి, సుబ్బారెడ్డి పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. 61వ డివిజన్ శాంతినగర్లో భాస్కరావుకొట్టు సెంటర్, శారద హైస్కూల్ వద్ద కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు ఉమ్మడి వెంకట్రావ్, నాలం బాబు, నాగిరెడ్డి అనిల్ పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతి బ్యానర్లు చింపి వేయడం హేయం

వైఎస్సార్ ట్రేడ్‌యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉమ్మడి తెలుగు ప్రజల హృదయాల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్థానం పదిలంగా ఉంటుందని వైఎస్సార్ ట్రేడ్‌యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డు ఫుడ్ జంక్షన్ సమీపంలో సోమవారం వైఎస్సార్ ట్రేడ్‌యూనియన్ ఆధ్వర్యాన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని భారీ కేక్ కట్‌చేసి మిఠాయిలు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ పేదల పక్షపాతి అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

వైఎస్సార్ విగ్రహాల ధ్వంసం దారుణం..

కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సుపరిపాలన అందించిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను ధ్వంసం చేయటం దారుణం అని డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. పేదల పక్షపాతి వైఎస్సార్‌ను కించపరిచే విధంగా సంఘవిద్రోహ శక్తులు వైఎస్సార్ జయంతి బ్యానర్లు చింపి వేయడం హేయ మైన చర్య అని అన్నారు. కొంతమంది అధికార మదంతో వైఎస్సార్ విగ్రహాలను తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజాగ్రహానికి గురికాకతప్పదు..

టీడీపీ నేతలు హద్దు మీరి ప్రవర్తించవద్దని తమ సహనానికి హద్దు ఉంటుందని గౌతంరెడ్డి అన్నారు. హద్దుమీరితే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదల శ్రీనివాస రావు, డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, నాయకులు కమ్మిలి రత్నకుమార్, సామంతపూడి చిన్న, ప్రభు, స్వామి, సీహెచ్ రమేష్, కృష్ణ, గోవింద్, వికాస్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



మధురానగర్‌లో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న యర్రంశెట్టి అంజిబాబు



డాక్టర్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న బెజ్జం రవికుమార్ తదితరులు



సత్యనారాయణపురంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..

సమస్యలకు సంతృప్తికర పరిష్కారం

వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ మహేష్



నగరవాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ మహేష్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర వాసుల నుంచి వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, అడిషనల్ కమిషనర్ (జనరల్) డాక్టర్ ఎ. మహేష్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదులు, పరిష్కార కార్యక్రమంలో ఆయన నగరవాసుల నుంచి అర్జీలు స్వీకరించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం మంచి అవకాశమని తెలిపారు. ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులను, విజ్ఞప్తులను సంతృప్తికరంగా పరిష్కారం అందిచాలని ఆదేశించారు. మొత్తం 14 ఫిర్యాదులు అందగా, వాటిలో ఇంజినీరింగ్ విభాగంపై-3, ప్రజారోగ్యం విభాగంపై-1, పట్టణ ప్రణాళిక విభాగంపై-7, పట్టణ సామాజికాభివృద్ధి విభాగం(యూసీడీ)-1, రెవెన్యూ-1, పరిపాలన విభాగంపై-1 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్ రావు, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీ ఎస్‌వీ ప్రసాద్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి. రత్నావళి, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి, డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ రామ్మోహన్‌రావు, ఎకౌంట్స్ ఆఫీసర్ నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సద్గురువుల సేవలో తరించాలి



వాగ్గేయ కారుల కీర్తనలను ఆలపిస్తున్న పీ జయంతి, పీ మహతి

విజయవాడ కల్చరల్: సంగీత కళాకారులు సద్గురువుల సేవలో తరించాలని ప్రముఖ వయోలిన్ విద్వాంసులు అన్నవరపు రామస్వామి యువకళాకారులకు సూచించారు. సుసర్ల దక్షిణామూర్తిశాస్త్రి 107వ పారుపల్లి రామకృష్ణయ్యపంతులు 76 ఆరాధనా సంగీతోత్సవాల సోమవారం నాటికార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సుసర్ల దక్షిణామూర్తి ప్రత్యక్ష శిష్యులు గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులని నగరంలో ఆరాధానా ఉత్సవాలకు ఆయనే ఆద్యుడని తెలిపారు. గురుకుల పద్ధతిలో సంగీతాన్ని శిష్యులకు నేర్పించి ఎందరికో సంగీత భిక్షను పెట్టారని తెలిపారు. కార్యక్రమంలో సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, బీవీ దుర్గాభవాని పాల్గొన్నారు. స్వరార్చనలో భాగాంగా బీ సీతామహాలక్ష్మి, పీ కనకదుర్గ, ఎస్ సాత్విక,. పెరవలి జయతి, పెవరవలి మహతి, మోదుసుధాకర్ వాగ్గేయకార కీర్తనలను ఆరంభించారు. నిర్వాహకులు ఉదయం అలంకార్ సెంటర్‌ని పారుపల్లి రామకృష్ణయ్య పంతులు చౌక్‌లోని ఆయన విగ్రహంవద్ద పుష్పాంజలి ఘటించారు.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): విజయవాడ-గూడూరు సెక్షన్‌లోని అప్పికట్ల-నిడుబ్రోలు-చుండూరు స్టేషన్‌ల మధ్యలో మూడో లైన్ నిర్మాణంలోని నాన్-ఇంటర్ లాక్ పనుల కారణంగా ఆ మార్గంలో నడిచే పలు రైళ్లు రద్దు చేయడంతో పాటుగా మరి కొన్నింటిని దారి మళ్లించి నడపనున్నట్లు విజయవాడ రైల్వే పీఆర్‌ఓ నుస్రత్ మండ్రుప్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.


రద్దయిన రైళ్లు..

ఈ నెల 15 నుంచి 30 వరకు విజయవాడ-గూడూరు (7500), ఈ నెల 16 నుంచి 31 వరకు గూడూరు-విజయవాడ (7458), ఈ నెల 16 నుంచి 30 వరకు విజయవాడ-ఒంగోలు (7461/7576), ఈ నెల 15 నుంచి 30 వరకు విజయవాడ-గూడూరు (12744), ఈ నెల 16 నుంచి 31 వరకు గూడూరు-విజయవాడ (12743), ఈ నెల 16, 23, 30 తేదీలలో గూడూరు-విజయవాడ (17259/17260), ఈ నెల 14, 21, 28 తేదీలలో తిరుపతి-విశాఖపట్నం (22708), ఈ నెల 15, 22, 29 తేదీలలో విశాఖపట్నం-తిరుపతి (22707) రైళ్లు పూర్తిగా రద్దు.

దారి మళ్లింపు...

ఈ నెల 15, 22, 29 తేదీలలో యర్నాకులం-హౌరా (22878), ఈ నెల 22, 29 తేదీలలో సత్రగచ్చి-తాంబరం (22841), ఈ నెల 22న హౌరా-బెంగళూరు (22863), ఈ నెల 23, 30 తేదీలలో మధురై-నిజాముద్దీన్ (12651) రైళ్లు వయా రేణిగుంట, యర్రగుంట్ల, నంద్యాల, గుంటూరు, కృష్ణా కెనాల్ మీదుగా దారి మళ్లించి నడపనున్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి



గులాబీతోట అంగన్‌వాడీ సెంటర్‌లో మాట్లాడుతున్న డాక్టర్ సృజన

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ కాచి, చల్లార్చి, వడపోసుకున్న నీటినే తాగాలని దుర్గాపురం ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ సృజన సూచించారు. స్థానిక గులాబీతోట అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తి గత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. నీటి నిల్వలలో దోమలు పెరుగుతాయని గమనించి, ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఒక వేళ నీటి నిల్వలు ఉంటే నగరపాలక సంస్థ సిబ్బందికి తెలియ చేస్తే వారు గంబూసియా చేపలు, మురుగునీటి నిల్వలలో ఆయిల్ బాల్స్ వేస్తారని తెలిపారు. వారంలో ఒక రోజు డ్రైడేగా పాటించాలని సూచించారు. దోమల వల్ల డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఏ అనారోగ్య సమస్యలు తలెత్తినా సమీపంలోని ఆరోగ్యకేంద్రంలో సంప్రదించాలని సూచించారు. ఆరోగ్యకేంద్రం సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): మతిస్థిమితం లేని తనతల్లి రావుట్ల పార్వతి (50) ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఆమె కుమారుడు శేషాచారి సోమవారం నున్న పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. వడ్రంగి పని చేస్తూ కండ్రికలో శేషాచారి కుటుంబం నివాసం ఉంటోంది. తన తల్లి మతి స్థిమితం లేక గతంలో పలు దఫాలు ఇళ్లు వదిలి వెళ్లి 10,15 రోజుల తర్వాత ఇంటికి తిరిగి వచ్చేదని, అయితే గత నెల 6వ తేదీన ఇంటి నుంచి వెళ్లి ఇప్పటి వరకు తిరిగి రాలేదని, బంధువులను, తెలిసిన వారిని విచారించినా ప్రయోజనం లేకపోవడంతో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

బాలుడి అదృశ్యంపై..

మధురానగర్(విజయవాడసెంట్రల్): పెన్ను కొనుక్కువస్తానని చెప్పివెళ్లిన కుమారుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో సోమవారం గుణదల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గులాబీతోటకు చెందిన పీ ఆదిలక్ష్మికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు ఈశ్వర మదన జనకారావు (15)ను సోమవారం తండ్రి కళాశాలలో దింపుతానని చెప్పగా తాను పెనుకొనుక్కుని వస్తానంటూ బయటకు వెళ్లాడు. ఎంతసేపటికీ తిరిగి రాకపోవటంతో చుట్టు పక్కల విచారించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవటంతో గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.